# వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

**నమస్తే తెలంగాణ**

## భరణంపై ఎనిమిది సూత్రాలు

**మన** దేశంలో విడాకుల సంఖ్య ఒక శాతంలోపేనని ఒక అంచనా. ప్రపంచ సగటుతో పోలిస్తే ఇది చాలా తక్కువగా అనిపిస్తుంది. కానీ, భరణం విషయంలో మాత్రం వివాదాలకు మన దేశంలో కొదవలేదు. భరణం ఇబ్బడిముబ్బడిగా డిమాండ్ చేయవచ్చనే భావన బహుశా ఈ వివాదాలకు దారితీస్తుండవచ్చు. అడిగినంత కట్నం తేలేదని అత్తింటి వారు పెట్టే ఆరళ్లు భరించలేక కోడళ్లు బలైపోవడం అనాదిగా జరుగుతున్న అనాచారం. దీనికి విలోమ దిశగా కూడా వేధింపులు ఉంటాయి. భర్తపై వేధింపుల కేసులు పెట్టి, విడాకులు పొంది, ఆపై భరణం పేరిట పీల్చిపిప్పి చేసే భార్యలూ ఉంటారు. అలాంటివారిని రెచ్చగొట్టి, కాపురాల్లో చిచ్చుపెట్టే తల్లిదండ్రులూ ఉంటారు. ఈ తరహా వేధింపులకు బలైపోయిన ఓ అభాగ్యజీవి అతుల్ సుభాశ్ ఉదంతంపై ప్రస్తుతం పెద్ద దుమారమే చెలరేగుతున్నది. ఈ బెంగళూరు టెకీ ఆత్మహత్య చేసుకునే ముందు విడుదల చేసిన సుదీర్ఘ లేఖలు, పెద్ద పెద్ద వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి.

అతుల్ విషయమే తీసుకుంటే భారీ భరణం కోసం భార్యతో సహా అత్తింటివారు వేధించడం, తన కుమారుడిని చూసేందుకు సైతం పెద్ద మొత్తం చెల్లించాలని డిమాండ్ చేయడం నాణేనికి మరోవైపు చూపిస్తున్నది. కోర్టులో విచారణ సమయంలో 'అడిగినంత భరణం ఇవ్వలేకపోతే చచ్చిపో' అని సుభాశ్ భార్య పరుషంగా మాట్లాడినప్పుడు జడ్జి నవ్వారనే అంశం నెటిజన్లకు తీవ్ర ఆగ్రహం తెప్పించింది. బహుశా ఈ కారణంగానేమో చట్టాలు, కోర్టులు మహిళలకే అనుకూలంగా ఉన్నాయని అతుల్ తన మరణ వాంగ్మూలంలో విమర్శలు చేసి ఉండవచ్చు. మరో కేసులో నెలకు రూ.6 లక్షల భరణం డిమాండ్ చేసిన భార్యను 'నువ్వు సంపాదించి చూపు' అని కర్ణాటక హైకోర్టు మందలించడం ఈ సందర్భంగా గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉన్నది. జీవనభృతి కాస్తా కొందరి విషయంలో గొంతెమ్మ కోరికలా మారుతున్నట్టు దీనిని బట్టి అవగతమవుతున్నది. మరోవైపు సుభాశ్ వంటివారి విషయంలో ఈ డిమాండ్లు ప్రాణాల మీదకు రావడం మనం చూస్తున్నాం.

ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు మరో కేసులో భరణం సమస్యపై కీలక తీర్పు వెలువరించింది. భరణంపై అంచనాకు వచ్చేందుకు ఎనిమిది అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించడం విశేషం. సామాజిక ఆర్థిక స్థోమత, భార్యాపిల్లలకు భవిష్యత్తు అవసరాలు, ఇరుపక్షాల విద్య, ఉపాధి స్థాయి, ఆదాయం, ఆస్తులు, ఇతర ఆర్థికవనరులు, పెండ్లి అయ్యేనాటికి భార్య స్థితిగతులు మొదలైనవి అందులో ఉన్నాయి. భరణం అనేది ఓ శిక్షలా మారకూడదనేది సుప్రీంకోర్టు తీర్పులో ముఖ్యాంశం. అది అటు భర్తకు తలకు మించిన భారం కారాదని, అదే సమయంలో భార్య జీవికకు సరిపోయే స్థాయిలోనూ ఉండాలనేది గీటురాయి అని సర్వోన్నత న్యాయస్థానం చేసిన సూచన ఆహ్వానించదగినది. అంతేకాదు, వరకట్న వేధిపుల నిరోధానికి ఉద్దేశించిన 498-ఏ చట్టం దుర్వినియోగం అవుతుండటాన్ని సుప్రీంకోర్టు ఎత్తిచూపడం గమనార్హం. భరణం విధివిధానాలపై ధర్మాసనం వెలువరించిన తీర్పు కీలకమైనదే అయినప్పటికీ సుభాశ్ వంటి బాధితులకు అది 'ఆలస్యంగా అందిన న్యాయమే'. ఆ తీర్పు నుంచి లబ్ధి పొందేందుకు అతడు సజీవుడై లేకపోవడం విషాదం.

# బీజేపీకి దారి చూపుతున్న రేవంత్

**సువిశాల భారతదేశంలో తెలంగాణ ఒక రాష్ట్రం మాత్రమే. కానీ, దేశాన్ని పాలిస్తున్న ప్రధాని మోదీకి మన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ దారి చూపుతున్నారు. ఇబ్బంది వచ్చినప్పుడల్లా ఆదుకుంటున్నారు. ఇదేదో వ్యంగ్యంగా చెప్తున్న మాట కాదు, ఇప్పటివరకు దేశంలో జరిగిన వివిధ రాష్ట్రాల ఎన్నికల్లో ఇబ్బందుల్లో ఉన్న బీజేపీని రేవంతే ఆదుకుంటున్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రెండు ప్రధాన రాష్ట్రాలు కర్ణాటక, తెలంగాణ ప్రభుత్వాల పనితీరు దేశవ్యాప్తంగా బీజేపీకి ప్రచారానికి ఉపయోగపడుతున్నది. ఇంకా చెప్పాలంటే, తెలంగాణ ఇంకాస్త ఎక్కువగానే ఉపయోగపడుతున్నది.**



**బుద్దా మురళి**





తెలంగాణలో ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంతో పాటు 'టీఎస్'ను 'టీజీ'గా మార్చడం, తెలంగాణ తల్లి విగ్రహ మార్పు, తెలంగాణ అస్తిత్వ గుర్తులను చెరిపివేయడం లాంటి చర్యలను దేశవ్యాప్తంగా బీజేపీ బాగానే వాడుకుంటున్నది. ఇప్పటికే ఢిల్లీలోని వీధుల పేర్లను బీజేపీ మార్చేసింది. రాజ్యాంగాన్ని కూడా బీజేపీ మారుస్తుందని కాంగ్రెస్ విమర్శిస్తున్నది. జాతీయ పతాకం.. మూడు రంగుల కాంగ్రెస్ జెండాను పోలి ఉందని, దాన్ని మార్చాలని కాంగ్రెసేతర పక్షాలు గతంలో డిమాండ్ చేశాయి. ఇప్పుడు కూడా మోదీ సర్కార్‌పై ఈగ వాలకుండా ఉండేలా రేవంత్ రెడ్డి చర్యలు కనిపిస్తున్నాయి. తెలంగాణ తల్లిని కాంగ్రెస్ తల్లిలా మార్చిన హస్తం పార్టీ బీజేపీ చేపట్టే మార్పులను ఏమని ప్రశ్నించగలదు?

హర్యానా, మహారాష్ట్ర ఎన్నికల్లో ప్రధానంగా తెలంగాణలోని రేవంత్ పాలన గురించే మోదీ ప్రచారం చేశారు. హర్యానాలో ఎగ్జిట్ పోల్స్‌లోనే కాదు, చివరికి ఓట్ల లెక్కింపు ప్రారంభంలో సైతం కాంగ్రెస్ గెలుస్తుందనే అనిపించింది. తీరా బీజేపీ ఘన విజయం సాధించింది. మహారాష్ట్రలోనూ కాంగ్రెస్ కూటమి అధికారంలోకి వస్తుందని మొదటినుంచీ వినిపించగా.. బీజేపీ కూటమి ఏకపక్షంగా విజయం సాధించింది. ప్రత్యేకించి, కర్ణాటక, తెలంగాణల్లోని కాంగ్రెస్ ప్రభుత్వాల పాలన మహారాష్ట్రలో కాంగ్రెస్‌ను బాగా ఇబ్బంది పెట్టింది. ఈ విషయాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే మీడియా సమక్షంలో వెల్లడించారు. 'మేమేమో కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో పథకాలు అద్భుతంగా అమలవుతున్నాయని ప్రచారం చేస్తుంటే, మీరేమో ఉచిత బస్సు పథకం అమలు చేయలేకపోతున్నాం, సమీక్షిస్తాం అని చెప్తున్నారు. ఇదేం పద్ధతి' అని సొంత పార్టీ పాలకులను బహిరంగంగా నిలదీశారు. మోదీ కూడా సరిగ్గా ఇదే పని చేశారు. మహారాష్ట్రలో ప్రతి సమావేశంలోనూ కర్ణాటక, తెలంగాణ సర్కార్ల వైఫల్యాలను ఎత్తిచూపారు. ప్రత్యేకించి, ఆరు గ్యారెంటీలంటూ తెలంగాణలో అధికారంలోకి వచ్చి అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని విస్తృతంగా ప్రచారం చేశారు. ఒక దశలో మహారాష్ట్ర ఎన్నికలు కాస్త తెలంగాణ ఎన్నికలు అనుకునేట్టుగా మారిపోయాయి. ముఖ్యమంత్రి రేవంత్‌తో పాటు మంత్రులు మహారాష్ట్రలో బైఠాయించి ప్రచారం చేశారు.

**ఆరు గ్యారెంటీలను అమలు చేస్తున్నామని కోట్ల రూపాయల తెలంగాణ సొమ్మును వెచ్చించి మహారాష్ట్ర పత్రికల్లో ప్రకటనలు ఇచ్చారు. అయితే, ఆరు గ్యారెంటీల్లో ఉచిత బస్సు మినహా ఏదీ అమలుకు నోచుకోలేదని, మహిళలకు నెలకు రూ.2500, పింఛన్ 4 వేలకు పెంపు, రైతుబంధు తదితర హామీలు అమలు కాలేదని బీజేపీ ప్రచారం చేసింది. ఆ ప్రచారం బాగానే ప్రభావం చూపింది. మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలే అందుకు నిదర్శనం.**

ప్రతిపక్షాలకు ఏమైనా మాట్లాడే అవకాశం ఉంటుంది. కానీ, అధికార పక్షానికి మాత్రం తాము ఇచ్చిన హామీలను నేరవేర్చడం తప్ప విపక్షంపై విమర్శలు చేసే అవకాశం ఉండదు. విమర్శలు చేసినా దాని ప్రభావం తక్కువే. కేంద్రంలో బీజేపీ పదేండ్ల నుంచి అధికారంలో ఉన్నది. నిజానికి, విపక్షాలు చేసే విమర్శలకు సమాధానం చెప్పాల్సిన స్థానంలో బీజేపీ ఉంది. అంతే తప్ప తాను విమర్శించే పరిస్థితిలో లేదు. కానీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో వైఫల్యాలను, అమలుకు నోచుకోని హామీలను బీజేపీ అన్ని రాష్ట్రాల్లో ప్రచారం చేస్తున్నది. మహాత్మాగాంధీ స్థానంలోనే సర్దార్ పటేల్‌ను నిలిపిన బీజేపీకి కాంగ్రెస్ గుర్తులను చెరిపేసి కొత్త గుర్తులను తెరపైకి తీసుకురావడం పెద్ద కష్టమేమీ కాదు. ఏమైె నా ఇబ్బందులు, విమర్శలు వస్తే తెలంగాణలో కాంగ్రెస్ మార్చిన గుర్తులు బీజేపీకి ఉపయోగపడతాయి. కేసీఆర్‌పై తీవ్రమైన వ్యతిరేకతతో కాంగ్రెస్ పేర్ల మార్పు కార్యక్రమాన్ని ముందటేసుకున్నది. అంతేతప్ప ఈ మార్పుల వల్ల తెలంగాణకు ఒరిగేదేమిటో ఎవరికీ తెలియదు.

తనకు ధైర్యం, భవిష్యత్తుపై ఆశ ఉండాలని దేవుడిని అత్యంత బలవంతుడైన రూపంలో మనిషి రూపొందించుకున్నాడు. అందుకే, తనకు లేనటువంటి బంగారు కిరీటాలు, నాలుగు చేతులను దేవుళ్లకు ఉన్నట్టు భావించాడు. శక్తివంతుడైన దేవుడు తనను కాపాడుతాడనేది మనిషి నమ్మకం. అదే విధంగా భరతమాతను, తెలుగుతల్లిని వివిధ రాష్ట్రాలవాళ్లు తమ మాతలను రూపొందించుకున్నారు. కాంగ్రెస్ వాదన, కాంగ్రెస్ అనుకూల కవుల వాదన ప్రకారం సగటు పేద మహిళలా తెలంగాణ మాత విగ్రహం ఉండాలనుకుంటే.. భారతమాత కూడా పేద మాతగానే ఉండాలి కదా? వాస్తవానికి, భారతమాత కిరీటం, బంగారు ఆభరణాలతోనే ఉంది కదా? ఆరు దశాబ్దాల కాంగ్రెస్ పాలనలో దేశంలోని 80 శాతం మంది ఇంకా దారిద్ర్యరేఖకు దిగువనే ఉన్నారు. 80 కోట్ల కుటుంబాలకు ఇప్పటికీ కేంద్రం సబ్సిడీ బియ్యం ఇస్తున్నది. కాంగ్రెస్ వాదన ప్రకారం ఇప్పుడున్న భరతమాత స్థానంలో నిరుపేద మహిళను భరతమాతగా ఎంపిక చేసుకోవాలేమో!

రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనకు ఇంకా నాలుగేండ్లు మిగిలి ఉన్నాయి. మహిళలందరినీ కోటీశ్వరులను చేస్తామని ముఖ్యమంత్రి, మంత్రులు పదే పదే చెప్తున్నారు. ఇప్పుడు మామూలుగా ఉన్న తెలంగాణ తల్లి కొత్త విగ్రహం స్థానంలో నాలుగేండ్ల తర్వాత కోటీశ్వరురాలైన తెలంగాణ తల్లి విగ్రహాన్ని తెస్తారా?

**ఏటా జీడీపీ లెక్కలు వస్తాయి. ఆ లెక్కలను బట్టి తెలంగాణ తల్లి రూపానికి మార్పులు చేస్తారేమో? కొందరు కవులకు కోటి రూపాయలు, హైదరాబాద్‌లో 300 గజాల భూమి నజరానాగా ప్రకటించారు. అయితే, 'ఒకవైపు సాంస్కృతిక విధ్వంసానికి పాల్పడుతూ మరోవైపు నజరానాలా?' అని ప్రముఖ కవి నందిని సిధారెడ్డి ఆ పురస్కారాన్ని తిరస్కరించారు. మరో కవి సుద్దాల అశోక్ తేజ మాత్రం కొత్త విగ్రహంలో తన తల్లి రూపం కనిపించిందని మురిసిపోయారు. ఈ నేపథ్యంలో 'తెలంగాణ ఉద్యమంలో అశోక్ తేజ ఎక్కడ?' అని కొందరు ప్రశ్నిస్తున్నారు.**

తెలంగాణ ఉద్యమం ఉధృతంగా సాగుతున్న రోజుల్లో చంద్రబాబు నివాసంలో సుద్దాల చాలాసార్లు కనిపించారు. టీడీపీ ప్రచారానికి పాటలు రాశారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా 'తలుపులు మూసి రాష్ట్రాన్ని విభజిస్తారా?' అని టీడీపీ కోసం ఆయన పాటలు రాశారు. పాటలు రాయడం ఆయన వృత్తి. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వ చర్య తెలంగాణ కవుల మధ్య చిచ్చుపెట్టినట్టు అయింది. నజరానాల వల్ల ప్రభుత్వం ఆశించిన ప్రయోజనం కన్నా వ్యతిరేక ప్రభావమే ఎక్కువ కలుగుతుంది.

అక్బర్ రోడ్ వంటి పేర్ల మార్పుతో బీజేపీ ఏ ప్రయోజనమైతే ఆశించిందో అది ఆ పార్టీకి దక్కింది. పేర్ల మార్పుపై కాంగ్రెస్ ఎంత వ్యతిరేకిస్తే బీజేపీకి అంత లాభం అది ఫలితాల్లో కనిపించింది కూడా. కానీ, తెలంగాణలో కాంగ్రెస్ చేస్తున్న ఈ పేర్ల మార్పుతో రేవంత్ రెడ్డి ఇగో సంతృప్తి పడవచ్చు. అంతిమంగా కాంగ్రెస్‌కే నష్టదాయకం. పైగా ఈ అంశం దేశవ్యాప్తంగా అన్ని చిహ్నాల మార్పునకు బీజేపీకి ఉపయోగపడుతుంది.

**కాంగ్రెస్ వాదన, కాంగ్రెస్ అనుకూల కవుల వాదన ప్రకారం సగటు పేద మహిళ లా తెలంగాణ మాత విగ్రహం ఉండాలనుకుంటే.. భరతమాత కూడా పేద మాతగానే ఉండాలి కదా? వాస్తవానికి, భారతమాత కిరీటం, బంగారు ఆభరణాలతోనే ఉంది కదా? ఆరు దశాబ్దాల కాంగ్రెస్ పాలనలో దేశంలోని 80 శాతం మంది ఇంకా దారిద్ర్యరేఖకు దిగువనే ఉన్నారు. 80 కోట్ల కుటుంబాలకు ఇప్పటికీ కేంద్రం సబ్సిడీ బియ్యం ఇస్తున్నది. కాంగ్రెస్ వాదన ప్రకారం ఇప్పుడున్న భరతమాత స్థానంలో నిరుపేద మహిళను భరతమాతగా ఎంపిక చేసుకోవాలేమో!**

# పంటకు ధర రైతే నిర్ణయించాలె

**సబ్బు బిల్ల, అగ్గిపుల్ల కాదేదీ కవిత కనర్హం అన్నారో ప్రముఖ కవి. దీన్ని ఇప్పటి పరిస్థితులకు అన్వయిస్తే సబ్బుబిల్ల.. అగ్గిపుల్ల కాదేదీ ధర పెరగడానికనర్హం అన్నట్లు ప్రస్తుతం మార్కెట్లో ప్రతి వస్తువు ధర పెరుగుతూనే ఉన్నది. ఉత్పత్తిదారులు ప్రతి వస్తువు ధరను అమాంతం పెంచేస్తున్నారు. ప్రభుత్వాలు సైతం అడ్డుచెప్పడం లేదు. పోనీలే కంపెనీలో కార్మికులను దృష్టిలో ఉంచుకుని ఇలా చేస్తున్నారనుకుందాం. అయితే, నిర్మాతలు నష్టపోకూడదని సినిమా టికెట్ల ధరలు పెంచేందుకు అనుమతులిచ్చే ప్రభుత్వాలు.. రైతు వద్దకు వచ్చేసరికి సరైన ధర లభించేలా కృషి చేయడం లేదు. అంటే రైతుల కష్టానికి విలువ లేదా?**



**వామన్ మామిళ్ల**
**99085 56358**



**ఎకరా పత్తి సాగుకు ఖర్చు (రూపాయల్లో)..**

| | | | |
|---|---|---|---|
| ఎకరం భూమి కౌలు | 20-25 వేలు | యూరియా | 780 |
| దుక్కి దున్నడానికి | 1500 | డీఏపీ | 4,110 |
| చదును చేయడానికి | 1200 | కలుపు మందు | 1000 |
| విత్తనాలు (2 ప్యాకెట్లు) | 1520 | కలుపు కూలీల ఖర్చు | 9,000 |
| కూలీలు | 1200 | పురుగు మందులు | 15,000 |
| ఎరువులు | 3,390 | పత్తి ఏరేందుకు కూలీ | 10,000 |

**మొత్తం ఖర్చు- 68,700-73,700**

రైతులు పదేండ్ల కిందటి వరకు ఎడ్లతో దుక్కి దున్ని చదును చేసి పంటలు పండించేవారు. ఇప్పుడు పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ఎరువులు, పురుగు మందుల ధరలు పెరిగాయి. యాంత్రీకరణ పుణ్యమాని వ్యవసాయానికి పెట్టుబడి భారంగా మారింది. ఇది చాలదన్నట్టు ఇప్పుడు కూలీల కొరత వెంటాడుతున్నది. వ్యవసాయం గిట్టుబాటు కాకపోవడమే అందుకు కారణం. అయినా మొక్కవోని ధైర్యంతో దేశానికి అన్నం పెట్టడానికి రైతులు పొలాన్ని నమ్ముకుంటున్నారు. ఈ క్రమంలో విత్తు నాటిన నాటినుంచీ పంట చేతికొచ్చేవరకు చేసే కష్టానికి రైతే బాధ్యుడవుతున్నాడు. కానీ, పండించే పంటకు మాత్రం ధర నిర్ణయించుకునే హక్కు రైతుకు లేదు. దీంతో రైతు బతుకు ఏటా అప్పుల సుడిగుండంలో చిక్కుకుపోతున్నది. ప్రభుత్వాలు మద్దతు ధర ప్రకటిస్తున్నా అది రైతులకు పూర్తిస్థాయిలో దక్కడం లేదు. ఆసియాలో వరంగల్, ఆదిలాబాద్ పత్తికి ఎక్కువ ఆదరణ ఉన్నది. కానీ, మద్దతు ధర లేక రైతులు పస్తులుంటున్నారు.

పత్తి సాగులో మన దేశం ప్రపంచంలోనే మూడో స్థానంలో ఉంది. ఇక దేశంలో తెలంగాణదీ అదే స్థానం. రాష్ట్రంలో అత్యధిక రైతులు పండించే పత్తి పంటకు కంటితుడుపు చర్యగా మద్దతు ధర ప్రకటించి ప్రభుత్వాలు చేతులు దులుపుకొంటున్నాయి. ఏటా ఎరువులు, పురుగు మందుల ధరలు పెరిగిపోతున్నాయి. దానికితోడు వాతావరణ, భూమి పరిస్థితులు పత్తి సాగుకు ఇబ్బందులు తెచ్చిపెడుతున్నాయి. అంతే కాదు, తెలంగాణలో నూటికి 60 శాతం మంది కౌలురైతులే. దీంతో కౌలు చెల్లింపు అదనపు భారంగా మారుతున్నది. బ్యాంకుల నుంచి వచ్చే అప్పు సరిపోక వడ్డీకి తెచ్చి పంట సాగు చేస్తే చివరకు పంట చేతికొచ్చే సమయంలో అకాల వర్షాలతో పంట నేలపాలవుతోంది. చేతికొచ్చిన కొంత పంటను మార్కెట్లో అమ్మేందుకు కష్టాలే. తేమ, గూడు, రంగు మారిందని సీసీఐ కొర్రీలు పెడుతున్నది. 8 నుంచి 12 శాతం లోపు తేమ ఉండాలన్న నిబంధన, రూ.7,525 మాత్రమే మద్దతు ధర నిర్ణయించడంతో ప్రైవేటు వ్యాపారులకు రూ.6,700- 6,900 ధరకే కట్టబెట్టాల్సిన దుస్థితి నెలకొన్నది. ఈ విధంగా పత్తి రైతు దగా పడుతున్నాడు.

నల్గొండ, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, సంగారెడ్డి, వికారాబాద్, వరంగల్, ఖమ్మం తదితర జిల్లాల్లో ఈ ఏడాది పత్తిపంట ఎక్కువగా సాగైంది. అయితే, పత్తి సాగుకు ఎకరానికి అవుతున్న ఖర్చులను చూస్తే రైతుల దయనీయ స్థితి అందరికీ అర్థమవుతుంది. ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలు, వడ్డీ రూపంలో వ్యాపారులు రైతుల నడ్డి విరిచేయడం అందుకు ప్రధాన కారణం. పత్తి విత్తనాల ధరపై రూ.50కి పైగా పెంచి వ్యాపారులు విక్రయించడంతో ఒక్కో ప్యాకెట్‌ను రూ.760 చొప్పున కొనుగోలు చేయాల్సి వచ్చింది. అంతేకాదు, రాశి 659 వంటి పత్తి విత్తనాలను వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించడంతో 900 వరకు చెల్లించాల్సి వచ్చింది.

**పెట్టుబడి కోసం దళారుల వద్ద అప్పు తెస్తే నూటికి 25 శాతం వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. అంటే 20 వేల వరకు వడ్డీలకే పోతున్నది. ఈ లెక్కన ఎకరానికి సుమారుగా రూ.95 వేల వరకు ఖర్చవుతుంది. ఎకరానికి 8-12 క్వింటాళ్ల దిగుబడే వస్తుంది. చెలక అయితే 8 క్వింటాళ్లు, నల్లరేగడి భూమి అయితే 10-12 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చే అవకాశముంది. అంటే సీసీఐ లెక్క ప్రకారం.. క్వింటాలు రూ.7,525 చొప్పున సుమారు 12 క్వింటాళ్ల దిగుబడి అనుకుంటే రూ.90,300 వస్తాయి.**

పెట్టుబడే సుమారుగా రూ.95 వేలు అవుతుంటే.. ఇక రైతుకు దక్కేదేముంది? ఇక దిగుబడి తగ్గితే ఇంకా అప్పుల్లో కూరుకుపోవాలి. ఇది సీసీఐకి విక్రయిస్తేనే. తేమ ఎక్కువగా ఉందని ప్రైవేటు వ్యాపారులకు అమ్మితే రూ.6,700 లెక్కన రూ.80,400 మాత్రమే వస్తాయి. అంటే ఎకరానికి రూ.15 వేల చొప్పున నష్టపోవాల్సిందే. ఇక ప్రకృతి సహకరించకపోతే మరింత నష్టం వస్తుంది.

ప్రభుత్వం కనీస మద్దతు ధర అంటూ ఆర్భాటం చేస్తున్నా.. అది రైతుకు దక్కడం లేదు. కార్పొరేట్ వ్యాపారులు ఎలా అయితే తమ ఉత్పత్తులకు తామే ధర నిర్ణయించి అమ్ముకోగలుగుతున్నారో అలాగే పంట ధర నిర్ణయించి విక్రయించుకునే వెసులుబాటు రైతులకు కల్పించాలి. రైతు వద్దకే వచ్చి పంట కొనుగోలు చేసే రోజులు రావాలి. బ్యాంకులు ఇచ్చే రుణాల పరిమితి పెంచాలి. రైతుభరోసా, రుణమాఫీ అంటూ ఆర్భాటపు ప్రచారాలు కాకుండా రైతులకు ఏది అవసరమో.. పంట అమ్ముకునేందుకు ఏ విధంగా చర్యలు తీసుకోవాలో ఆలోచించాలి. నష్టమొస్తే దాన్ని ప్రభుత్వమే భరించేలా చర్యలు తీసుకోవాలి. రైతుకు చేయాల్సింది సాయం కాదు, ధర నిర్ణయించుకునే నిర్ణయాధికారం ఇవ్వాలి. అప్పుడే రైతు రాజవుతాడు.

**ప్రభుత్వం కనీస మద్దతు ధర అంటూ ఆర్భాటం చేస్తున్నా.. అది రైతుకు దక్కడం లేదు. కార్పొరేట్ వ్యాపారులు ఎలా అయితే తమ ఉత్పత్తులకు తామే ధర నిర్ణయించి అమ్ముకోగలుగుతున్నారో అలాగే పంట ధర నిర్ణయించి విక్రయించుకునే వెసులుబాటు రైతులకు కల్పించాలి. రైతు వద్దకే వచ్చి పంట కొనుగోలు చేసే రోజులు రావాలి. బ్యాంకులు ఇచ్చే రుణాల పరిమితి పెంచాలి. రైతులకు ఏది అవసరమో.. పంట అమ్ముకునేందుకు ఏ విధమైన చర్యలు తీసుకోవాలో ఆలోచించాలి.**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అయింది. ఈ కాలంలో ఏం సాధించిందీ ప్రభుత్వం? ప్రజలకు ఇచ్చిన హామీలను ఏ మేరకు నెరవేర్చింది? చేసింది ఎంత? చెప్పుకొన్నది ఎంత? ఏడాది పాలన ఎట్లా సాగిందో ఓ సారి చూద్దాం.

# మెరిపిస్తామని మురిపించి మోసం



**వొద్యారపు రవికుమార్**



ఎన్నికలకు ముందు మెరిపిస్తామని మురిపించారు. కానీ, ఇప్పుడు ఏడిపిస్తున్నరు. ఇది స్థూలంగా కాంగ్రెస్ ఏడాది పాలన. ఈ ఏడాది పాలనకు వారు ప్రజాపాలన విజయోత్సవాలు అంటున్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే పాలకులు. ఇన్నేండ్ల తర్వాత ఇప్పుడే ప్రజాస్వామ్యం వచ్చినట్టు.. ఇప్పుడే ప్రభుత్వం ఏర్పడినట్టు కాంగ్రెస్ నాయకులు ప్రచారం చేసుకుంటున్నారు. ఏ పేరు పెట్టి ఉత్సవాలు చేసుకున్నా.. ప్రజలు ఈ పాలనను హర్షిస్తున్నారా? లేక విమర్శిస్తున్నారా? అనేది కూడా అవలోకనం చేసుకోవాల్సిన అవసరం ఉన్నది. ప్రతి సందర్భంలో ఓ నెరేషన్‌ను బిల్డప్ చేసి ప్రజల మీద రుద్దుతున్నారు కాంగ్రెస్ పాలకులు. ముఖ్యమంత్రి నుంచి మొదలుపెడితే మంత్రులు, ఎమ్మెల్యేల వరకు అందిరిదీ అదే వరుస.

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఉచిత బస్సు పథకం మాత్రమే అమలు చేశారు. ఆ తర్వాత మిగతా వాటి ఊసే లేదు. ఇతరుల చెప్పుల్లో కాళ్లు పెట్టి 'ఇగో ఈ బ్రాండెడ్ చెప్పులు మావే' అని చెప్పుకున్నట్టు ఉంది వీళ్ల వ్యవహారం. గత ప్రభుత్వ హయాంలో సాగుతో పాటు ఇతర రంగాలు, వృత్తులు ఎలా వృద్ధి చెందాయో మనకు తెలిసిందే. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత వృత్తులు, ఉపాధి మార్గాల గురించిన పట్టింపే లేదు. విద్యారంగం గురించిన సోయి లేదు. నోరు తెరిస్తే చాలు మేడిగడ్డ కుంగింది.. కరెంట్ కొనుగోళ్లకు భారీగా ఖర్చుపెట్టారని అంటున్నారు. గత ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించకుండా ఉంటే ఈ ఏడాది లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి సాధ్యపడేదా? గత ప్రభుత్వం విజయవంతంగా అమలుచేసిన పథకాలు, కార్యక్రమాల నిర్వహణ కూడా ఈ పాలకులకు చేతకావడం లేదు. అందుకే రాష్ట్రంలో నిత్యం కోతల కరెంట్ వస్తున్నది. రైతుబంధు ఇంకా అందలేదు. గత ప్రభుత్వం నిర్మించిన థర్మల్ పవర్ ప్రాజెక్టులను అట్టహాసంగా ప్రారంభిస్తూ అప్పులు.. అప్పులు అని గావుకేకలు పెట్టడం ఎందుకు?

ఎదుటివారి తప్పును ఎత్తిచూపే ముందు తమ తప్పు ఏమిటో కూడా తెలుసుకోవాలి. గత ప్రభుత్వం లక్షల కోట్ల విలువ చేసే సంపదను సృష్టించింది. భవిష్యత్తు తరాలకు భరోసా ఇచ్చింది. ఏం చేశారని కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిలోనే లక్ష కోట్ల రూపాయలు అప్పులు చేసింది? ఆ మొత్తాన్ని వేటిపై ఖర్చు పెట్టింది? ఏ సంపద సృష్టించేందుకు బాటలు వేసింది? ఒక్క ఏడాదిలోనే అన్నీ సాధ్యం కావు. అవుతుందని, అవ్వాలని కూడా ఎవరూ అనడం లేదు. వాస్తవాలను గుర్తించకుండా, ప్రజలకు వాస్తవాలు తెలియకుండా చేయాలనుకోవడం తప్పు. అయితే అనుభవం ద్వారా ప్రజలకు వాస్తవాలు అవగతంలోకి వస్తాయి. ఈ విషయాన్ని ప్రభుత్వం మర్చిపోయినట్టుంది.

**2014లో బీఆర్ఎస్ ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే చెరువుల పూడికతీతకు పూనుకున్నది. ప్రతి ఇంటికీ తాగునీరు ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. క్షణం కూడా కరెంట్ పోకుండా చర్యలు తీసుకున్నది. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను మరింతగా పెంచేందుకు ప్రణాళికలు రచించింది. 2014-15 బడ్జెట్‌ను చూస్తే నాటి ప్రభుత్వ వాస్తవిక దూరదృష్టి అర్థమవుతుంది.**

కానీ, ఈ ప్రభుత్వం మాత్రం వచ్చిన వెంటనే శ్వేతపత్రాల పేరిట ప్రజలను ఏమార్చే పనిని పెట్టుకున్నది. విద్య, వైద్యం, సాగు, తాగునీటి రంగాల విషయంలో నాటి ప్రభుత్వం సాధించిన విజయాల గురించి కేంద్రప్రభుత్వం, కేంద్ర సంస్థలు చాలాసార్లు ప్రస్తావించాయి. కాంగ్రెస్ నాయకులు కూడా పొగిడిన సందర్భాలున్నాయి. లాజికల్‌గా మాట్లాడుతూ తాము విపక్ష ఆరోపణలను తిప్పికొడుతున్నామని అనుకుంటే మొదటికే మోసం వస్తుంది. ఇప్పటికీ రైతు భరోసా ఇవ్వలేదు. కౌలురైతుల గురించి సోయి లేదు. రైతు కూలీల ప్రస్తావన లేదు. తెలంగాణ విధ్వంసం తప్ప పునాదులను బలపర్చాలనే భావన పాలకుల్లో ఏ మాత్రం లేదని ప్రజలు చర్చించుకుంటున్నారు.

తొలి ఏడాది పాలన తీరు వచ్చే నాలుగేండ్లలో ఎట్లా ఉండబోతున్నదో కండ్లకు కట్టినట్టు చూపిస్తుంది. ఈ ఏడాది కాలంలో ఒక్కటంటే ఒక్క అడుగు కూడా అభివృద్ధి దిశగా పడలేదు. రాబోయే కాలంలో ఆ దిశగా పడుతుందనే భరోసా కూడా లేదు. అప్పుల్లో ఉన్నామని, తమ వద్ద నిధులు లేవని పదే పదే చెప్తున్నారు. మన కంటే బీద రాష్ట్రాలు ఇన్ని మార్లు అప్పుల గురించి చెప్పుకోవడం లేదు. కానీ, కాంగ్రెస్ నాయకులు మాత్రం దాన్నో మంత్రంలా పఠిస్తున్నారు. పాతంలా వల్లె వేస్తున్నారు. ఈ క్రమంలో ప్రజలు తమపై పెట్టిన బాధ్యతను గుర్తించడం లేదు. ఏడాది పాలన సాంతం ఏడ్చిన కన్ను తూడ్చినట్టే తప్ప కొత్తగా ఏమీ లేదు.

తమను నమ్మి ఓట్లు వేసిన గ్రామాలను కాంగ్రెస్ గాలికొదిలేసింది. పాలమూరు వలసల వార్తలు మళ్లీ కనిపిస్తున్నాయి. కరెంట్ కోతలు, విత్తనాలు, ఎరువులు అందక రైతులు పడుతున్న ఇబ్బందుల వార్తలు పతాక శీర్షికలకెక్కుతున్నాయి. ఇప్పటికైనా పాలకులు తమ తప్పులను సరిద్దుకుని ముందుకు సాగితే వారికే మంచిది. అస్తమానం గత ప్రభుత్వంపై నిందలేస్తూ కాలం గడిపితే ఏదో ఒక రోజు ప్రజలు తిరగబడతారు.